# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ 'మార్గదర్శి-బంగారు కుటుంబ పథకం' కాలం చెల్లిన ధర్మకర్తృత్వ సిద్ధాంతపు నకలే

ఎన్డీఏ కూటమినేతగా చంద్రబాబు నాయుడు రెండో పర్యాయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత నుండి ఆగ మేఘాల మీద రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాడని, అందుకొరకు అహర్నిశలు శ్రమిస్తున్నాడని ప్రభుత్వం, పార్టీ నేతలు భారీ ప్రచారం కల్పిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధోగతిలో ఉందని అంటూనే ఆకాశానికి నిచ్చెనలు వేసే అనేకానేక పథకాలను రోజుకొకటిగా వెల్లడిస్తూ రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతోందని, చంద్రబాబు విజన్-2020 విజయవంతమైనట్లుగానే, ప్రస్తుత విజన్ -2047 కార్యరూపం దాలిస్తే2029 సంవత్సరాని కల్లా పేదరికం అనేది రాష్ట్రంలో కనబడదని హోరెత్తిస్తున్నారు.

గత ప్రభుత్వ పాలకులు, వివిధ పథకాల పేరున ఎంపిక చేసిన లబ్ధిదారుల ఖాతాలలోకి 'బటన్ నొక్కుడు'తో ఎంతో కొంత నగదును బదిలీ చేసి కాలం గడిపారని, కానీ తమకు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళు అంటూ, తాము సంపదని పంచటంతో పాటు సంపదను సృష్టిస్తామని పదేపదే వల్లే వేస్తున్నారే కానీ, దానికి ఆచరణాత్మక రూపం ఏమిటో మాత్రం చెప్పడం లేదు.

అయితే తిమ్మిని బమ్మిని చేసే పాలకులు చేపట్టే తల్ల క్రిందుల విధానాలు, పథకాలన్నీ శ్రామికుల శ్రమ శక్తిని, దేశ సంపదలను సామ్రాజ్యవాద, కార్పొరేట్ యాజమాన్యాలకు దోచిపెడుతూ ప్రజలను బికారులుగా మారుస్తున్నాయి. వీరి దోపిడీ విధానాలు దేశాన్ని,ప్రజలను స్వావలంబన దిశగా ఏమాత్రం నడపకపోగా, నిరంతరం ప్రజలను ఎదురు చూపులు చూసేవారిగానే మిగులుస్తున్నాయి.

ప్రభుత్వం తన బాధ్యతను గాలికొదిలి, ప్రభుత్వ ఆస్తులను బడా కార్పొరేట్లకు ధారాధత్తం చేసి, వారు పెట్టిన పెట్టుబడికి పదింతల లాభాన్ని ప్రజల నుండి పిండుకొనే విధానాన్ని ప్రభుత్వం పి-3(పబ్లిక్- ప్రైవేట్- పార్టనర్‌షిప్)గా గొప్పగా ప్రకటించుకుంటున్నది. కాగా, ఈ ఉగాది నుండే పి-4 (పీపుల్- పబ్లిక్- ప్రైవేట్- పార్టనర్‌షిప్) అనే పేరిట మరో కొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తెచ్చింది. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన ధ్యేయంగా ఈ పథక రచన చేసినట్లుగా, నాలుగు దశాబ్దాల చంద్రబాబునాయుని రాజకీయ అనుభవంతో రూపొందించిన, ఆయన 'మానస పుత్రిక'గా దీనిని పేర్కొంటున్నారు. సమాజంలోని 20% పేదలు (ఏ గణాంకాల ప్రమాణాల ప్రకారమో తెలియదు), 10% సంపన్నులు (దీనికి కొలబద్ద ఏమిటో తెలియదు) ఉన్నారని... ఈ సంపన్నులంతా స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఒక్కొక్కరు... 20 శాతంగా ఉన్న పేదలలోని కొన్ని కుటుంబాలను దత్తత తీసుకొని, ఆ కుటుంబాలను ఆర్థికంగా, విద్యా, వైద్య పరంగా ఆదుకొని వారిని వృద్ధిలోకి తీసుకొని రావటం అనేది ఈ పథక సారాంశం. 'మార్గదర్శి- బంగారు కుటుంబం' పేరున ఊరూరా సంపన్నులైన ఓ మార్గదర్శిని ఎంపిక చేసి,వారికి కొన్ని పేద కుటుంబాల అభివృద్ధి బాధ్యతను అప్పగించే కార్యక్రమం సాగుతోంది.

100 సంవత్సరాలకు ముందు నుండే జాతీయోద్యమ నాయకుడు గాంధీ ధర్మ కర్తృత్వ సిద్ధాంతాన్ని ప్రబోధిస్తూ వచ్చాడు. సమాజంలో సంపన్నులు, ఆస్తిపరులు, పారిశ్రామిక యజమానులంతా వారి వారి ఆస్తులకు ధర్మ కర్తలుగా మాత్రమే వ్యవహరించాలని, పేద లందరినీ ఒక క్రమంలో అభివృద్ధి చేసుకుంటూ రావాలని ప్రబోధించాడు కూడా. ఈ బోధనలతో... కార్మికుల శ్రమశక్తిని దోపిడీ చేసుకుని, అదనపు విలువను అంతకంతకు ఎక్కువగా కొల్లగొట్టి తమ లాభాలను మరింతగా పెంచుకోవాలనే బడా సంపన్నుల, పారిశ్రామిక యజమానుల మనసులు ఎన్నడైనా కరిగాయా?! కార్మికుల జీవితాలను ఉద్ధరించకపోయినా... కనీసం వారి న్యాయమైన డిమాండ్లను సకాలంలో సక్రమంగా పరిష్కారం చేసేందుకైనా వారు పూనుకున్నారా?!

'మేకకు పులి ధర్మకర్తగా' ఉండి మనుగడ సాగించాలనే ఈ సిద్ధాంతాన్ని... గత ఏడున్నర దశాబ్దాలుగా భిన్న రూపాలలో పాలకులు వల్లెవేస్తూ వస్తున్నారు. అయినా, పేదల జీవన స్థితిగతులలో మార్పు ఏమీ రాలేదు. పేదలందరి జీవన స్థితిగతులను మెరుగుపరిచి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే రాజ్యాంగ ధర్మాన్నుండి కూడా వారు తప్పుకొని, యాజమాన్యాల, బడా సంపన్నుల దయా దాక్షిణ్యాల పైననే పేదలు ఎల్లకాలం ఆధారపడి ఉండే విధంగా చేస్తున్నారు. మరోవైపు నుండి శ్రామికుల శ్రమశక్తిని నిర్దాక్షిణ్యంగా మొరటు రూపాల్లో దోపిడీ చేస్తూ సామ్రాజ్యవాద బడా కార్పొరేట్ కంపెనీల యాజమాన్యాలు అనూహ్యామైన లాభాలను పోగేసుకోవటాన్ని, విదేశీ కంపెనీలు దేశ సంపదను కారు చౌకగా తరలించుక పోవడాన్ని కప్పి పెడుతూ ప్రజల్ని వంచన చేస్తున్నారు.

2025లో ఫోర్బ్స్ విడుదల చేసిన తాజా నివేదిక, మూడు వేలకు పైగా ప్రపంచ కుబేరుల జాబితాను ప్రకటించింది. గత ఏడాదికాలంగా వీరంతా సగటున రోజుకు 46 వేల కోట్ల రూపాయలు పైగా ఆర్జించారని ఆ నివేదిక తెలిపింది. 100 కోట్ల డాలర్ల (8500 కోట్ల రూపాయలు) పైగా సంపదలు కలిగిన బిలియనీర్ల సంఖ్యలో మన దేశం 205 మందితో ప్రపంచంలో మూడవ స్థానంలో ఉంది. ఇరు తెలుగు రాష్ట్రాలలోనూ ఈ జాబితాలో 12 మంది స్థానం సంపాదించుకున్నారు. కారుచౌకగా కార్మికుల శ్రమశక్తిని, సహజ సంపదలను కొల్లగొట్టకుండా వేల; లక్షల కోట్ల సంపదలు వీరి వద్ద ఎలా పోగుపడ్డాయి?!

బ్రిటిష్ పాలనా కాలం నాటికంటే ప్రస్తుత భారతదేశంలోనే అసమానతలు పెరుగు తున్నాయని 1922-2023ల మధ్యకాలంలోని దేశ ఆర్థిక స్థితిగతులను పరిశీలించిన వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ పరిశోధన తేటతెల్లం చేస్తోంది. జనాభాలోని కేవలం ఒక శాతం సంపన్నుల వద్దనే, మొత్తం దేశ సంపదలోని 40 శాతం పోగుపడి ఉంది.పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం దేశంలోని నిరుద్యోగం 20 శాతానికి పైగా ఉంది. నిరుద్యోగుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. 2024 సంవత్సరంలో ప్రపంచ ఆకలి సూచి నివేదికలోని 127 దేశాల జాబితాలో, మన దేశం 105వ స్థానంలో ఉండడం... 75 సంవత్సరాల కేంద్ర, రాష్ట్ర పాలకుల నయవంచక దోపిడీ విధానాలకు నిలువెత్తు నిదర్శనం. ఈ దేశంలోని 80 కోట్ల మంది పేదలకు...స్వాతంత్ర్య అమృతకాలం తర్వాత కూడా ఉచితంగా ఆహార ధాన్యాలు పంపిణీ చేస్తున్నామని ప్రకటించుకోవడాన్ని... పాలకులు సిగ్గుచేటయిన విషయంగా భావించటం లేదు. ఆకలి, పోషకాహార లోపంతో రోజుకి 4500 మంది పసిపిల్లల ప్రాణాలు గాలిలో కలిసిపోతుండటానికి కారణం... దశాబ్దాల కాలంగా ఈ దోపిడీ పాలకుల నిర్వాకం కాదా?! జాతీయ గ్రామీణ ఆర్థిక సంయుక్త సర్వే ప్రకారం దేశంలో వ్యవసాయ కుటుంబాల నెలవారీ సగటు సంపాదన 13,661 రూపాయలు. కాగా, దీనిలో పంట సాగు ద్వారా వారికి లభించేది కేవలం 4,476 రూపాయలు మాత్రమే అని ఈ సర్వే ప్రకటించింది. పంటలకు మద్దతు ధరలు కల్పించకుండా మార్కెట్ మాయాజాలంతో రైతాంగ బ్రతుకులను ఛిద్రం చేసిన ఫలితమిది! సంవత్సరాల తరబడి రైతాంగ న్యాయమైన డిమాండ్లను పాలకులు పెడచెవిన పెట్టి... వారి ఆందోళనలను అణచివేస్తూ రావడం, మన కళ్ళ ముందున్నదే! 2022 సంవత్సరంలో దేశ వ్యాప్తంగా 11,290 మంది రైతు కూలీలు బలవన్మరణాలకు పాల్పడ్డారని ప్రభుత్వ గణాంకాలే పేర్కొనటం... రైతాంగ దుస్థితికి అద్దం పడుతోంది.

వాస్తవాలన్నీ ఇలా ఉండగా 'మార్గదర్శి -బంగారు కుటుంబం' పథకాన్ని అమలు చేస్తూ నిర్వహిస్తున్న సభలలో రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఎంత సంపాదించినా చివరకు తీసుకెళ్లేదేమీ వుండదని, పేదలకు చేయూత నందిస్తే చరిత్రలో మిగిలిపోతామంటూ ధర్మపన్నాలు, నీతి సూత్రాలు ప్రబోధిస్తున్నాడు.

రైతు కూలీలు శ్రమ చేయకుండా వ్యవసాయ పంటల ఉత్పత్తి జరగదని, భూగర్భం నుండి ఖనిజాలను వెలికి తీయకుండా, ముడి సరుకును ఉపయోగించి పరిశ్రమలలో యంత్రాలపై కార్మికులు కండలు కరిగించి శ్రమ చేయకుండా పారిశ్రామిక ఉత్పత్తి సాధించ లేమనేది... అందరికీ తెలిసిందే. దేశంలో లభ్యమయ్యే సహజ వనరులను,అశేష శ్రామిక శక్తిని అనుసంధానం చేస్తేనే... దేశంలో వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులు విశేషంగా పెరిగి దేశ సంపద గణనీయంగా పెరుగు తుందనేది స్పష్టం. ప్రజల నిజ తలసరి ఆదాయాల పెరుగుదల కానీ, పేదరిక నిర్మూలన క్రమానికి గానీ మరో దగ్గరి మార్గాలు లేవనేది వాస్తవం. శ్రమను సామాజీకరించిన విధంగానే, శ్రమ ఫలితమైన ఉత్పత్తిని కూడా సామాజీకరించడం ద్వారానే సమాజంలో గణనీయమైన మార్పులు సాధ్యమవుతాయి. ఉత్పత్తి సాధనాలైన భూమి, గనులు,పరిశ్రమలపై ఉత్పత్తి శక్తులైన శ్రామికుల అధికారం నెలకొన్ననాడు... నిజమైన అర్థంలో అంతరాలు తొలగి, ప్రజల శ్రేయో రాజ్యం ఆవిష్కార మవుతుంది.

దేశంలోని అశేష శ్రామిక ప్రజానీకం తమ దుస్థితికి మూల కారణాన్ని అర్థం చేసుకొని తిరగబడితే, దోపిడీ పునాదులు కదులుతాయని గ్రహించిన పాలకులు... శ్రామిక ప్రజల చైతన్యాన్ని నీరుగార్చే, ప్రక్కదోవ పట్టించే, వారి ఐక్యతను భగ్నంగావించే... పలు రకాల కుయుక్తులను పదేపదే ప్రయోగిస్తున్నారు. శ్రామిక ప్రజల పోరాటచేవను నీరుగార్చే, సంపన్నుల దయా ధర్మాల కోసం ఎదురుచూసే వారుగా మలచే 'మార్గదర్శి-బంగారు కుటుంబం' తరహా పథకాల వెనుకనున్న వర్గ సంకర భావజాలాన్ని త్రిప్పికొట్టాలి. శ్రామిక ప్రజానీకం తమ కనీస అవసరాలు అయిన భూమి, నివాసం, విద్యా, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ఆత్మ గౌరవంతో... పోరాడి ఓ హక్కుగా సాధించుకోవాలి.